ఉన్నత చదువుకు మోక్షమెప్పుడో?

- ఇంటర్, డిగ్రీకి ఎన్నో ఇక్కట్లు..
- గ్రామీణ విద్యార్థులకు తప్పని తిప్పలు
- దూరభారంతో మధ్యలోనే చదువుకు స్వస్తి
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఉండవెల్లిలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు (ఫైల్)

ఉండవెల్లి: మండలంలో ఇంటర్, డిగ్రీ కళాశాల లేక పోవడంతో ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారు. నిత్యం కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో డిగ్రీ కళాశాల లేకపోవడంతో తల్లిదండ్రులు విద్యార్థినులను దూరం పంపలేక చదువును మధ్యలోనే మాన్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టి సారించి అలంపూర్ చౌరస్తాలో అందరికి అందుబాటులో ఉండేలా ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం పది, ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థులు పెరుగుతూనే ఉన్నారు. పదో తరగతిలో వెయ్యికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారు. ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు అక్కడితోనే చదువు మానేస్తున్నారు. కొంత ఆర్థికంగా ఉన్న విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు. వనపర్తి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, గద్వాల్ జిల్లాలకు ఇంటర్ విద్యకోసం ప్రయాణిస్తున్నారు. పాలమూరు యూనివర్సిటీ, గద్వాల్, ఉస్మానియా హైదరాబాద్ కళాశాలలకు వెళ్లాలంటే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అలంపూర్ చౌరస్తాలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. డిగ్రీ కళాశాలను ప్రవేశపెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలి



పదో తరగతి పాసైన విద్యార్థుల కోసం ప్రతి మండలంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తామని పాలకులు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. ప్రభుత్వ కళాశాల మండలంలో ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి. బాల్య వివాహాలు కూడా అరికట్టగలం. కళాశాలలు దూరం ఉండడం వల్ల విద్యార్థినులకు వివాహాలు చేస్తున్నారు. అధికారులు ఆలోచించాలి.

– పరశురాముడు, బొంకూరు

విద్యార్థినుల అవస్థలు..



పదో తరగతి, ఇంటర్ వరకు చదవుకునే విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. డిగ్రీ కళాశాలలు దూరంగా ఉండడంతో విద్యార్థినుల సంఖ్య తగ్గిపోతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రధాన సమస్య ఉంది. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే అందరికి ఉన్నత విద్య దగ్గరవుతుంది.

– విష్ణు, పుల్లూరు

క్లుప్తంగా

ఓపెన్ కబడ్డీ పోటీలు

అలంపూర్‌రూరల్: మండలంలోని క్యాతూర్ గ్రామంలోని ఈదమ్మ జాతర సందర్భంగా మే 1, 2 తేదీల్లో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నగదు బహుమతులను దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్‌ను

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు శాస్త్రవేత్తల ద్వారా నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వీడియో కన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడి వేసవిలో కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుపుతారని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగు వల్ల కలిగే లాభాలు తెలియజేస్తారని, రైతుల సందేహాలను తీర్చుతారని, వ్యవసాయంలో మెలుకువలపై పలు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు.

చెట్లు తొలగించినా పట్టించుకోరా?



ఉండవెల్లి: ఒక వైపు ఎండలు మండుతున్నాయి, మరో వైపు నీడనిచ్చే చెట్లు నరికేస్తున్నారు. మండలంలోని కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కల ఉన్న చెట్లను నరికేశారు. నీడనిచ్చే చెట్లను నరికేయడంతో అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎండలు మండుతుండగా నీడ లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలు మృతి



శోభారాణి(ఫైల్)

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన శోభారాణి(56) ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. ఆమె కర్నూల్ నివాసం ఉంటున్నారు. మండలంలోని కలుకుంట్ల యూపీఎస్ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పెద్దపోతులపాడు, తదితర పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డులు తీసుకున్నారు. స మయపాలన, క్రమశిక్షణ, విద్యార్థులకు ఉత్తమంగా విద్యను బోధించేవారని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. ఆమెకు భర్త రవికుమార్‌రెడ్డి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె మృతిపట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



గద్వాల అర్బన్: సబ్బండ వర్గాల ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ టీజేఎస్ అని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్‌గౌడ్ అన్నారు. టీజేఎస్ పార్టీ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయం వద్ద ఆయన టీజేఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఐదేళ్లుగా ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రజాస్వామిక రాజకీయాలను ఎజెండాగా పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, వీరభద్రప్ప, బాషా, నందిన్నె వీరేష్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్



మానవపాడు: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర సందర్భంగా సోమవారం ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌కు 28 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు ఈరన్న, రమేష్, రవి, కాశీ తెలిపారు. ఈ టోర్నమెంట్ మంగళవారం కూడా కొనసాగుతుందని, క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సీడీపీఓ హేమలత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గంజిపేటలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చిన్నారులపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించి, వారికి మెరుగైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రత్యేకంగా చిత్రాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాల నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న ఎంవీ ఫౌండేషన్, యాజమాన్య కమిటీ సభ్యులు

రాజోళి: వేసవిసెలవుల దృష్ట్యా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులతో మాట్లాడుతూ, వేసవి కాలం పిల్లలకు ఆసక్తికర అంశాలను నేర్పించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా వారిని బయటకు పంపకుండా చూసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కమిటీలో కొందరి పదవీకాలం పూర్తవుతున్నందున, వారు బాలల హక్కులపై, వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ వేసవిలో పాఠశాలల్లో చేయాల్సిన పలు మరమ్మతులను పూర్తి చేయాలని, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మండల కమిటీ చైర్మన్ చిన్నయ్య, భాస్కర్, సభ్యులు, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు



మట్టిపరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మల్దకల్: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా రైతులు అధిక దిగుబడి పొందవచ్చని ఏఓ రాజశేఖర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని తాటికుంట గ్రామంలో రైతుల వ్యవసాయ పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ పొలాల్లో ప్రతిఏటా మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా మంచి దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు మట్టిపరీక్షలు చేయించు కోవడంతో పాటు పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఖాజాపాషా, రవి, శివయాదవ్, నరేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిలిచిన రహదారి పనులు

- ఏడాది క్రితమే శంకుస్థాపన
- డబ్బులు సరిపోక నిలిచిన పనులు



నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రం నుంచి నాగసానిపల్లి వరకు 5 కి.మీ. బీటీ రహదారి నిర్మాణానికి 2019లో మొదటి విడత రూ.3.20 కోట్లు, 2023లో రెండో విడత రూ.1. 30 కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడత నిధులతో నిర్మాణ పనులు, మట్టి పనులు, కల్వట్లు, బ్రిడ్జి, కొంతభాగం వైట్ మిక్సరు వేసి, ఇంక కొంత భాగం మట్టి పనులు చేపట్టారు. అంతలోనే బీటీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. నాగసానిపల్లి నుంచి శ్రీరంగాపురం వెళ్లడానికి ప్రజలు గులకరాళ్ల మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో మండల కేంద్రానికి వెళ్లడానికి బీటి రోడ్డు అవుతుందని ప్రజా రవాణా మెరుగవుతుందని ఆశ పడిన ప్రజలకు నిరాశే మిగిలింది. గత ప్రభుత్వంలో 2019లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.3.20 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రహదారిని ఆలస్యంగా ప్రారంభించారు. రహదారి వెంబడి 2కిలో మీటర్ల వరకు కంకర వేశారు. 3 కిలో మీటర్ల వరకుమట్టి వేసి, కంకర వేయలేదు. కల్వట్లు పూర్తి చేశారు. గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు ,అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం..

గతంలో మండల కేంద్రానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తిఅయింది. కానీ మట్టి కొట్టక పోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– నరేష్, నాగసానిపల్లి

పనులు పూర్తి చేయిస్తాం..

బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యింది. ఇరువైపుల రోడ్డు పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌నాయుడు, ఏఈ పీఆర్, శ్రీరంగాపురం

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

అయిజ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన అయిజ మండల కేంద్రంలోని అరోరా జూనియర్ కళాశాల విద్యార్థులను కలెక్టర్ బీఎం సంతోష్ సోమవారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో కె.ఉదయ్ కుమార్ 992 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంక్, జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా యు.లక్ష్మి 983, భావన 980 మార్కు లు సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో బైపీసీలో కె.అఖిల 985, భార్గవి 981 మార్కులు సాధించారు. జిల్లా కేంద్రంలో నోడల్ ఆఫీసర్ హృదయరాజు ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శాలువాలు కప్పి ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమన్, లెక్చరర్లు నరసింహ చారి, శ్రీనివాసులు, మధుబాబు, దానయ్య, విదార్థులు పాల్గొన్నారు.

రాంపాటి శివాలయంలో కలశ స్థాపన



రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో ఉన్న రాంపాటి శివాలయంలో సోమవా రం కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల ముందు నుంచే ఆలయ శుద్ధి, రంగులు వేసి ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం నుంచి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా కలశస్థాపన చేశారు. అనంతరం వేలాది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి, సాయంత్రం భజనలు, సంకీర్తనలతో స్వామి సేవలో తరించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



అయిజ: మండలంలోని ఈడుగోనిపల్లిలో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రసిడెంట్ గోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమ్‌సేన్‌రావు, వెంకటేష్, లక్ష్మణ్, నరసింహులు, ఉరుకుందు, జయరాములు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బీజేపీతో సుస్థిర పాలన సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వెంకటాపురం, ఉమిత్యాలలో ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్రభీంరెడ్డి, నాగిరెడ్డి, హంపిరెడ్డి, గోవిందు, రంగస్వామి, కృష్ణకాంత్, ఉరు కుందు, నర్సింహులు ఉన్నారు.

శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిపించి సుస్థిర పాలనకు నాంది పలకాలని వడ్డేపల్లి టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని 167,168,169 పోలింగ్ బూ తుల్లో బూత్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు శివ, మనోహర్, సంజి, యుగంధర్, పెద్దరాముడు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి



గట్టు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి విన్పించారు. సీహెచ్ఓ ఉస్సేని మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అవసరం ఉంటే తప్పా బయటకు రావద్దని, వడ దెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా గ్రామాల్లో తెలియజేయాలని ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఐదు ఎకరాల్లోపు రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ స్వామి సభ్యులకు సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా పాత బోర్లను మరమ్మతు చేసి, అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ కృష్ణయ్య తెలిపారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న చోట రైతులకు చెందిన వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకుని తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఏఈ తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నిరోదించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పాత బోర్లు, చేతి పంపులను మరమ్మతు చేసి, సిద్ధం చేయాలని, గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీలు పని చేసే చోట నీడ ఏర్పాట్లు చేయాలని కోరారు. బోయలగూడెంలో నెలకొన్న సమస్యలపై వైస్ ఎంపీపీ సుమతి సభ దృష్టికి తీసుకొచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటులో కనీసం సమాచారం ప్రజాప్రతి నిధులకు ఇవ్వలేదని గొర్లఖాన్‌దొడ్డి ఎంపీటీసీ బొజ్జయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, ఎంపీడీఓ చెన్నయ్య, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

మానవపాడు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నందున సాధారణంగా ముగించినట్లు ఎంపీపీ అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు ఎన్నికల విధులకు హాజరవుతున్నారని, సమస్యలపై చర్చ లేకుండానే ముగించినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సమస్యల పరిష్కారం కోసం సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు స్వాములు, రేణుక, మహేశ్వరి, మండల కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సిరాజ్ అహ్మద్, అధికారులు డాక్టర్ రిజ్వానా తాన్విర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆస్మా, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజాపాలన



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

గద్వాల: ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజా పాలన అందుతుందని, దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 28వ వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, ప్రజా సంక్షేమం ఆ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. ప్రజలను వంచించిన బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో రాష్ట్ర ప్రజలు సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. ఆయా వార్డులలో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

ఆర్ఎస్పీకి మద్దతు ఇవ్వండి

గద్వాల అర్బన్: బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతు ఇవ్వాలని మైనార్టీ నాయకుడు అతిఖుర్ రహ్మాన్ కోరారు. సోమవారం మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్‌కు, జమాతుల్ ఉలమా హింద్ సదర్ మౌలాన మత్లూబ్ హుస్సేన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

యువత ప్రజలను చైతన్యపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌ప్రజ్ఞ

శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల్లో యువత ముందుండి ప్రజలను చైతన్య పరచాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ యువతకు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువతను మేల్కొలిపి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థి మల్లురవి తనయుడు మల్లు సిద్ధార్థ, మండలాలకు చెందిన అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, యువజన అధ్యక్షులు పాల్గొన్నారు.

‘రోడ్డు వేయండి మహాప్రభో!’



కంకర వేసి వదిలేసిన మాన్‌దొడ్డి - రాజోళి రోడ్డు

రాజోళి: ‘మా గ్రామానికి రోడ్డు వేయండి మహాప్రభో’ అని ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్న నాయకులు పట్టించుకోవడం లేదని మాన్‌దొడ్డి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాన్‌దొడ్డి నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు తుమ్మిళ్ల మీదుగా గతంలో రోడ్డు మంజూరైంది. ఆ మార్గంలో రోడ్డు పనులు ప్రారంభించేందుకు సంవత్సరాలు పట్టింది. చాలా కాలం తర్వాత కంకర వేశారని, అది వేసి ఏళ్లు గడుస్తున్నా, ఇంతవరకు పనులు ముందుకు సాగడం లేదు. ఈ రోడ్డు పూర్తి అయితే మాన్‌దొడ్డే కాకుండా చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ, ననునూరు గ్రామాలకు రాకపోకలు సులువు కావడంతో పాటు మండల కేంద్రానికి తక్కువ దూరంతో చేరుకోవచ్చని అంటున్నారు. అత్యవసర సమయంలో కర్నూల్‌కు వెళ్లేందుకు ఈ మార్గంలో ప్రయాణం సులువుగా ఉంటుంది. నిన్న మొన్నటిదాకా పనులు ప్రారంభమవుతాయని చెప్పిన నాయకులు, అధికారులు ఇప్పుడు ఎన్నికల కోడ్ అనే సాకుతో మాట దాటవేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కంకర రోడ్డు కావడంతో ద్విచక్ర వాహనాలు జారిపడి గాయాలవుతున్నట్లు తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయండి



నీలహళ్లి - పాతపాలెం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి వద్ద గ్రామస్తులు

ధరూరు: మండలంలోని నీలహళ్లి – పాతపాలెం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొన్ని నెలల క్రితం నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపేశారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. అసంపూర్తి పనుల వద్దకు నీలహళ్లి, పాతపాలెం, మిర్జాపురం తదితర గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు చిలుక మునెప్ప, కృష్ణమూర్తి, ఆంజనేయులు, పాండు, సాయిబాబ, వీరన్న, కర్రెప్ప తెలిపారు.